క్లుప్తంగా

జక్కాపూర్ విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండలం జక్కాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు సోమవారం విడుదలైన ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ షౌకత్ అలీ తెలిపారు. 8వ తరగతి విద్యార్థులు రాసే ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ఇంత మంది అర్హత సాధించడం జిల్లాలోనే మొదటిసారి అని చెప్పారు. 2021 నుంచి పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ వస్తున్నారని తెలిపారు. జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన ఎం.అశ్విత్‌రెడ్డితో పాటు మొదటి పది ర్యాంకులలో ఐదు ర్యాంకులు జక్కాపూర్ విద్యార్థులే సాధించారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో నాయకులు

దుబ్బాక: పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సోమవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. అంతకు ముందు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. కార్యక్రమంలో నాయకులు పీఏసీఎస్ వైస్‌చైర్మన్ కాల్వ నరేశ్, మచ్చ శ్రీనివాస్, తునికి సురేశ్, మల్లుగారి రాంచంద్రారెడ్డి ఉన్నారు.

కానిస్టేబుల్‌కు సీపీ అభినందన


కానిస్టేబుల్‌ను అభినందిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: సిద్దిపేటలో ఆదివారం నిర్వహించిన సూర్య నమస్కారాల పోటీల్లో 1,150 సూర్య నమస్కారాలుచేసి రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించిన ఎస్‌బీ కానిస్టేబుల్ వేణును పోలీసు కమిషనర్ అనురాధ సోమవారం అభినందించారు. ఇక ముందు కూడా మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలోఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌లు శ్రీధర్‌గౌడ్, కిరణ్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, కోర్టు మానిటర్ ఎస్ఐ నరసింహారావు, పీఆర్‌ఓ మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులై..


ఉపాధ్యాయులతో విద్యార్థులు

దుబ్బాకటౌన్: రాయపోల్ మండలం బేగంపేట ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. డీఈఓగా అఖిల్, ఎంఈఓగా శివ, ప్రధానోపాధ్యాయురాలిగా వర్షిణి, తదితర విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. అనంతరం వారికి ఉపాధ్యాయులు బహుమతులందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రవీణ్ కుమార్, సీఆర్పీ యాదగిరి తదితరులున్నారు.

నేటి నుంచి వాలీబాల్ టోర్నీ


డ్రా తీస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని మంగళవారం నుంచి మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ తెలిపారు. సోమవారం చిన్నకోడూరులో వాలీబాల్ క్రీడల డ్రా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజేతలకు మొదటి బహుమతి రూ. లక్ష, రెండో బహుమతి రూ.75వేలు, మూడో బహుమతి రూ.50వేలుగా నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, సాయిరాం, పాపయ్య, శ్రీనివాస్, ఉమేశ్‌చంద్ర తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేటజోన్: స్వచ్ఛంద సంస్థలు, ఆసుపత్రులు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏసీపీ మధు సూచించారు. సోమవారం స్థానిక సిటీ న్యూరో ఆసుపత్రిలో వెల్‌నెస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె పరీక్షల శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుతం మనిషి ఒత్తిడికి గురవుతున్నాడని, ఆరోగ్యం మీద ప్రత్యేక శ్రద్ధ ఉండాలని సూచించారు. తప్పనిసరిగా యోగ, ధ్యానం, వాకింగ్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు హకీమ్, పవన్ భట్నాకర్, శ్యామియల్, నిర్వాహకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

బ్రిడ్జిలా.. ప్రచార బోర్డులా?

జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్‌లో బీజేఆర్ చౌరస్తా, మెదక్‌రోడ్ రైతుబజార్, కోటిలింగాల ఆలయం సమీపంలోను ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఇప్పుడు ప్రచార బోర్డులుగా మారాయి. అంతే కాదు కోతులు, కుక్కలకు నివాస స్థలాలుగా ఉపయోగపడుతున్నాయి. దీంతో పాదచారులు కింద నుంచే రోడ్డు దాటుతున్నారు. లక్షలు ఖర్చుపెట్టి నిర్మించిన బ్రిడ్జిలను వినియోగంలోకి తేవాలని పాదచారులు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట


రైతుబజార్ దగ్గర ప్రచార బోర్డుకే పరితమైన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి


బీజేఆర్ చౌరస్తాలో నిరుపయోగంగా..

వైభవంగా మల్లన్న విగ్రహ ప్రతిష్ఠోత్సవం


ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

వర్గల్(గజ్వేల్): నూతనంగా నిర్మితమైన వర్గల్ శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మల్లన్న నామస్మరణతో వర్గల్‌లో ఆధ్యాత్మికతలు వెల్లివిరిశాయి. విద్యాసరస్వతి క్షేత్ర వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి దంపతులు ఆలయాన్ని సందర్శించి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. యాదవసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితర ప్రముఖులు సందర్శించి స్వామివారి ఆశీస్సులు పొందారు.

ప్రసన్న హరికృష్ణకే బీసీల మద్దతు


హరికృష్ణకు మద్దతు తెలుపుతున్న నాయకులు

హుస్నాబాద్: కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను గెలిపించాలని బీసీ సంక్షేమశాఖ నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన నామినేషన్ కార్యక్రమంలో హరికృష్ణకు మద్దతుగా బీసీ సంఘాల పక్షాన ఆయన కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులో ప్రభుత్వం విద్యకు అతి తక్కువ నిధులు కేటాయించి నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రైవేట్‌రంగంలో ఉద్యోగం చేస్తున్న పట్టభద్రులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కరువైందని వాపోయారు. ఓల్డ్ పెన్షన్ విధానాన్ని అమలు చేయడంలేదని, శాసన మండలిలో పట్టభద్రుల గొంతుక వినిపించాలంటే విద్యావేత్త హరికృష్ణను గెలిపించాలని కోరారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని తన పరిపాలన దక్షతతో కేసీఆర్ సంక్షేమంలో అగ్రగామిగా మలిస్తే.. నేడు అందుకు భిన్నంగా పరిపాలన సాగుతోందని ఆరోపించారు. ఏడాది కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలుచేసి రేవంత్‌రెడ్డి తన చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు మధు, మాజీ ఎంపీపీలు అమరావతి, పాండుగౌడ్, మాజీ జెడ్పీటీసీ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మా.. కరుణించమ్మా..


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

గజ్వేల్‌రూరల్: స్థానిక రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి అభిషేకం, హోమం, కుంకుమార్చన కార్యక్రమాలు వైభవంగా జరిపించారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళితో పాటు భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నవితరణ చేపట్టారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

యాదవులను మోసం చేసింది బీఆర్ఎస్

శ్రీకృష్ణ యాదవ సంఘం నేత


మాట్లాడుతున్న యాదవ సంఘం నేతలు

చిన్నకోడూరు(సిద్దిపేట): గొర్రెల పంపిణీ పేరుతో యాదవులను మోసం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని శ్రీకృష్ణ యాదవ సంఘం సిద్దిపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మీసం మహేందర్ యాదవ్ అన్నారు. చిన్నకోడూరులో సోమవారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు యాదవులకు ఏమి చేసిందో చెప్పకుండా కాంగ్రెస్ యాదవులకు ఏమీ చేయడం లేదనడం ఎమ్మెల్యే హరీశ్‌రావుకు సరికాదన్నారు. యాదవుల వద్ద డీడీ కట్టించుకుని గొర్రెపిల్లలు పంపిణీ చేయకుండా జాప్యం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. గొర్రెల పథకం పేరుతో బీఆర్ఎస్ దళారులు కోట్లు దండుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం యాదవుల సంక్షేమానికి పాటుపడుతోందని చెప్పారు. నాయకులు పరశురాములు, రమేశ్, ప్రశాంత్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీకి కాంగ్రెస్ నేత నామినేషన్


నామినేషన్ పత్రం చూపుతున్న శ్రీనివాస్

దుబ్బాక: మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్ ఇతర నాయకులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

కంచె నిర్మాణాన్ని అడ్డుకున్న తండావాసులు

ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించాలని డిమాండ్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని సేవాలాల్ మహరాజ్‌తండాలో ఇళ్ల మధ్య ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేసేందుకు వెళ్లిన అసిస్టెంట్ లైన్‌మెన్ లక్‌పతినాయక్‌ను తండావాసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయంలా కంచె నిర్మాణానికి విద్యుత్‌శాఖ ఆదేశించిందన్నారు. దీంతో నిర్మాణ పనులు జరుగుతున్న క్రమంలో తండావాసులు అడ్డుకొని ఇళ్ల మధ్య నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారని తెలిపారు. కానీ ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కచోట నుంచి మరోచోట బదలాయింపు కింద చార్జి కట్టవలసి ఉంటుందన్నారు.

బహిరంగ వేలానికి రూ.4.25 లక్షల ఆదాయం

సిద్దిపేటరూరల్: బుగ్గ రాజేశ్వరస్వామి దేవస్థాన దుకాణాల బహిరంగ వేలంపాటలో రూ.4.25 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ బాగన్న కరుణాకర్ ముదిరాజ్ తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ఆరు రోజుల జాతరతో పాటు సంవత్సరానికి కొబ్బరికాయల దుకాణం, సైకిల్ పార్కింగ్, నూనె గురుగుల విక్రయం, కొబ్బరిచిప్పలు, లడ్డూ పులిహోరకు బహిరంగ వేలం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఈఓ శ్రీధర్ రెడ్డి, అర్చకులు సీతారామ శర్మ, డైరెక్టర్లు శ్రీనివాస్, ఉప్పలయ్య గౌడ్, సరళ, మైపాల్ రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

కుక్కలు, పందుల బారి నుంచి రక్షించండి

వినతిపత్రం అందజేసిన గ్రామస్తులు

కొముదవెల్లి(సిద్దిపేట): గ్రామంలో కుక్కలు, పందుల బారి నుంచి తమను కాపాడాలని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కారోబార్ కృష్ణకు గ్రామస్తులు సోమవారం వినతిపత్రం అందిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో కొంత కాలంగా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, గుంపులుగుంపులుగా వచ్చి మనుషులపై దాడిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఒక్కరోజే ముగ్గురిపై దాడిచేశాయంటేనే కుక్కలు బెడద ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవాలని అధికారులకు సూచించారు. కుక్కలతోపాటు నివాస ప్రాంతాలలో కొంత మంది పందులను పెంచడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో కుక్కలు, పందులను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు మహేశ్, డి.ప్రవీణ్, ఎ.విజయ్‌కుమార్, సనాది కరుణాకర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులపై అప్రమత్తం

- క్రమశిక్షణతో లక్ష్యాలను సాధించాలి
- పోలీసు అధికారులు



విద్యార్థులతో సీఐలు ఉపేందర్, దుర్గ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్, మాటలను నమ్మవద్దని, వారిపై అప్రమత్తంగా ఉండాలని టూటౌన్ సీఐ ఉపేందర్, మహిళా పోలీస్ ఇన్‌స్పెక్టర్ దుర్గ విద్యార్థులకు సూచించారు. సోమవారం సిద్దిపేట బీఎంఆర్ డిగ్రీ కళాశాలలో మహిళల రక్షణ చట్టాలు, షీ టీమ్ విధులు, గుడ్‌టచ్ బాడ్‌టచ్, సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారుల రక్షణకు పెద్దపీట వేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లోను షీ టీమ్ ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేశామని, ఎవరైనా అవహేళన చేసినా, వేధించినా వెంటనే ఒక చిట్టీరాసి బాక్స్‌లో వేయాలని సూచించారు. సెల్‌ఫోన్ వల్ల ఎంత మంచి ఉందో, అంత చెడు కూడా ఉందని, వాటికి బానిసలు కావద్దని కోరారు. ఎలాంటి సమస్యలు ఉన్నా డయల్ 100, షీ టీమ్ నంబరు 8712667434కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తగిన ఎత్తు, బరువు ఉండాలి


రహీంగూడతండాలో చిన్నారి ఎత్తును పరిశీలిస్తున్న ఇన్‌చార్జి సూపర్‌వైజర్ సంతోష

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిన్నారులు వయసుకు తగిన ఎత్తు, బరువు ఉండాలని మండల ఇన్‌చార్జి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష సూచించారు. ఆమె మండల పరిధిలోని రహీంగూడ, రహీంగూడ తండాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లలోపు చిన్నారుల ఎత్తు, బరువులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లులు తమ పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, ఎదుగుదల సక్రమంగా లేకపోతే తాము సూచించిన పోషకాహారం ఇవ్వాలన్నారు. బలహీనంగా ఉన్న చిన్నారులపై అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, సరైన పోషకాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ భూలి, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతకు మాజీ ఎమ్మెల్యేల పరామర్శ


భద్రయ్యను పరామర్శిస్తున్న మైనంపల్లి

ములుగు(గజ్వేల్): ఇటీవల మాతృవియోగం పొందిన మండలంలోని చిన్నతిమ్మాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు భద్రయ్య యాదవ్‌ను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సోమవారం వేర్వేరుగా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన తల్లి మరణంపై వారు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు సలీం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసగుప్త, నాయకులు మహిపాల్‌రెడ్డి, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను చాటినప్పుడే సమాజంలో గుర్తింపు


విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

గజ్వేల్‌రూరల్: క్రీడాకారులు ప్రతిభను చాటినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరేశ్ బాబు అన్నారు. స్థానిక బీఎంఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖేలో భారత్ క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలై తమ విలువైన జీవితాన్ని కోల్పోవద్దన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడా పోటీల ద్వారా మానసికోల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. ఓటమితో నిరాశ చెందకుండా విజయం వైపు అడుగులు వేయాలని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆదిత్య, మహేందర్, లలిత, అఖిల, కల్యాణ్, చందు, మహేశ్ పాల్గొన్నారు.

నల్లా కనెక్షన్‌కు పర్మిషన్ ఇవ్వడం లేదు

బాధితుడి ఆవేదన


ధ్రువపత్రాన్ని చూపుతున్న సంపత్

కొముదవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్‌లో పంచాయతీ కార్యదర్శి బాలరాజు నల్లా కనెక్షన్‌కు పర్మిషన్ ఇవ్వడంలేదంటూ బాధితుడు దీకొండ సంపత్ సోమవారం ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొన్ని రోజులుగా నల్లా కనెక్షన్‌కు పర్మిషన్ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి బాలరాజును పలు మార్లు కోరినా పర్మిషన్ ఇవ్వకుండా, ఇంటి నిర్మాణానికి ఇచ్చిన పర్మిషన్‌ను రద్దుచేస్తానని బెదిరిస్తున్నాడని వాపోయాడు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తనకు పర్మిషన్ ఇప్పించాలని వేడుకున్నాడు. ఈ విషయమై కార్యదర్శి బాలరాజును వివరణ కోరగా అతడు నిర్మిస్తున్న ఇల్లు నిబంధనలకు విరుద్ధంగా ఉందని, అంతకు ముందే అతడికి పలుమార్లు నోటీసులు జారీ చేశామని చెప్పారు.

సంక్షిప్త వార్తలు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

గజ్వేల్‌రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ మురళి హెచ్చరించారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన చౌరస్తాల వద్ద ఇటీవల తమ సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో 25మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామని చెప్పారు. వారిని సోమవారం జడ్జి ప్రియాంక ఎదుట హాజరుపర్చగా రూ.12.500 జరిమానా విధించినట్లు తెలిపారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా రాజు

దుబ్బాకటౌన్: మున్సిపల్ పరిధిలోని లచ్చపేట పద్మశాలి సంఘం నూతన అధ్యక్షుడిగా బడుగు రాజును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. లచ్చపేటలోని మార్కండేయ దేవాలయంలో అధ్యక్షుడు బల్ల గణేశ్ ఆధ్వర్యంలో సోమవారం నూతన కమిటీని నియమించారు. ఉపాధ్యక్షుడిగా మోహన్, కార్యదర్శిగా వెంకటేశ్, సహాయ కార్యదర్శిగా సతీశ్, కోశాధికారిగా రాజేశ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు వారిని సన్మానించారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. టూటౌన్ సీఐ ఉపేందర్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 17 మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో సోమవారం హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.25,500 జరిమానా, వారిలో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

ఓటరు జాబితా సిద్ధం

నంగునూరు(సిద్దిపేట): మండంలోని 11 ఎంపీటీసీ స్థానాలకు గాను ఓటర్ల జాబితాను సిద్ధం చేశామని ఎంపీడీఓ లక్ష్మణప్ప తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల వారీగా జాబితా సిద్ధంచేసి ఎంపీటీసీ స్థానాల వారీగా తుది జాబితా రూపొందించామన్నారు.ఆ డ్రాఫ్ట్‌ను ఎంపీడీఓ కార్యాలయంలో అందుబాటులో ఉంచామని చెప్పారు. .

నేడు నీటి సరఫరా నిలిపివేత

సిద్దిపేటజోన్: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మంగళవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోయర్ మానేరు డ్యామ్ నుంచి వచ్చే పైపులైనుకు గాలిపల్లి వద్ద మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో పలు వార్డుల్లో మంగళవారం నీటి సరఫరా ఉండదని, బుధవారం పునరుద్ధరిస్తామని తెలిపారు.

ప్రభుత్వాసుపత్రికి ఫ్రీజర్ అందజేత

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి ఐవీఎఫ్ ఆధ్వర్యంలో ఫ్రీజర్‌ను అందజేయడం అభినందనీయమని ఐవీఎఫ్(ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్) రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యాపారరంగంతో పాటు సేవా కార్యక్రమాల్లో ఆర్య వైశ్యులు ముందుంటారన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి ఫ్రీజర్‌ను అందించిన వైశ్య నాయకులు తోట భిక్షపతి, గోలి సంతోష్, ఆదిమూలం నారాయణను అభినందించారు. కార్యక్రమంలో వైశ్యులు సత్యనారాయణ, శ్రీనివాస్, సంతోష్, ప్రభాకర్, సంపత్, సత్యనారాయణ, భిక్షపతి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నార్కొటిక్స్ డాగ్స్‌తో తనిఖీ

హుస్నాబాద్: పలు బేకరీలు, పాన్‌డబ్బాలతో పాటు తదితర అనుమానాస్పద ప్రాంతాలలో నార్కొటిక్స్ డాగ్స్‌తో సోమవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. గంజాయి రహిత జిల్లా గురించి ప్రతిఒక్కరూ సహకరించాలని, యువత తాత్కాలిక ఆనందం కోసం జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు ఎవరైనా కలిగి ఉన్నా, విక్రయించినా వెంటనే డయల్ 100లేదా తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా హుస్నాబాద్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డాగ్ స్క్వాడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ కరీంనగర్ రోడ్డు ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ సరఫరా లైన్‌ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్‌నగర్, వేములవాడ కమాన్, ఆర్‌టీఏ కార్యాలయం, లింగారెడ్డిపల్లి ఎక్స్ రోడ్డు, టూటౌన్ పోలీస్ స్టేషన్ ఏరియా, సీసీ గార్డెన్ ఏరియాలలో ఉదయం 8.30 నుంచి 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.